అధ్వానంగా గ్రామీణ లింక్ రోడ్లు

- కొరవడిన కనీస మరమ్మతులు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు రైతుల ఇబ్బందులు



చింతలపల్లిలో రోడ్డు బురదగా ఉండడంతో దిగబడిన ట్రాక్టర్ నుంచి కొబ్బరి కాయలను బయటకు తెస్తున్న కూలీలు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలోని గ్రామాల్లో లింక్ రోడ్లు, వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. కనీస మరమ్మతులు లేకపోవడంతో పాటు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అవి మరింత ఛిద్రమవుతుండడం వల్ల కనీస రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు, మామిడికుదురు మండలాల్లో 59 గ్రామాల్లో సుమారు 100కు పైగా లింక్, వ్యవసాయ పొలాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయని అధికారుల అంచనా. వీటి పొడవు సుమారు 200 కిలో మీటర్ల పొడవు ఉంటుంది. ఈ రోడ్లన్నీ శిథిలస్థితికి చేరుకుని చాలా కాలమైంది. సముద్రతీర గ్రామాల్లో ఇసుక పుంతలకు వేసిన గ్రావెల్ రోడ్లతో పాటు, ఇతర మెటల్ రోడ్లు కూడా అధ్వానంగా మారాయి. ఈ రోడ్లు కనీసం మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. ఇటీవల ఉపాధి హామీ పథకంలో రోడ్లు వేసే అవకాశం వచ్చినప్పటికీ అరకొర నిధుల కేటాయింపులతో అవి అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఉపాధి హామీ పథకంలో మండలానికి పదికి మించి రోడ్లకు కూడా భూమి పూజ చేయలేదు. గతంలో మండల పరిషత్ నిధులతో పాటు, ఆర్థిక సంఘం నిధులు కూడా వస్తూ ఉండడంతో గ్రామాల్లో విరివిగా రోడ్ల మరమ్మతులతో పాటు, కొత్త రోడ్లు కూడా నిర్మించేవారు. ప్రస్తుతం కొత్త రోడ్ల సంగతి ఎలా ఉన్నా, పాడైపోయిన రోడ్లకు కూడా మరమ్మతులు చేసే నాథుడే లేడు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గడపగడపకూ మన ప్రభుత్వంలో కొన్నిటిని నిర్మించింది. ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. గ్రామాల్లో కొత్తగా అనేక కాలనీలు ఏర్పాటవుతున్నా, వీటికి రోడ్ల సౌకర్యం ఉండడం లేదు. బురదలోనే నడిచి వెళ్తున్న కాలనీ ప్రజలెందరో ఉన్నారు. ఇక వ్యవసాయ ప్రాంతాల్లో రైతులకు నిత్యం ఉపయోగపడే లింక్ రోడ్ల పరిస్థితి కూడా అదే దుస్థితిని ఎదుర్కొంటున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు సైతం రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కడలి, కాట్రేనిపాడు, చెన్నడం, పాలగుమ్మి, శివకోడు, చింతలపల్లి, గూడపల్లి, పల్లిపాలెం, తూర్పుపాలెం, కేశనపల్లి, శంకరగుప్తం, ఇరుసుమండ, లక్కవరం, మట్టపర్రు, రామరాజులంక, మేడిచర్లపాలెం తదితర గ్రామాల్లోని పంచాయతీరాజ్, మండల పరిషత్ రోడ్లన్నీ దుర్భర స్థితిలో ఉన్నాయి. ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటు ఇస్తే తప్ప ఇటువంటి రోడ్ల అభివృద్ధి సాధ్యపడే అవకాశం లేదు. తాజా ఎమ్మెల్యేలను, ఎంపీలను కలసి తమ గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, గోదావరికి సంభవించిన వరదలకు లంకల్లో లింక్, పంచాయతీ రోడ్లు సైతం కొట్టుకుపోయాయి. వీటి నష్టాన్ని కూడా సంబంధిత అధికారులు అంచనా వేసి ఉన్నతాధికారులకు పంపారు. ఎప్పుడు మరమ్మతులు చేస్తారో అధికారులకే తెలియని పరిస్థితి.

మెరుగైన రోడ్లు వేయాలి



గ్రామాల్లో వ్యవసాయ పొలాలకు, నివాస కాలనీలకు సరైన రోడ్లు లేవు. రోడ్లు పాడవడంతో పాటు, అసలు నిర్మాణం జరగని పుంతలు కూడా ఉన్నాయి. ఫలితంగా రైతులు, ప్రజలు కూడా అవస్థలు పడుతున్నారు. గ్రామీణ రోడ్లను మెరుగు పరచాలి.

– మంగెన సూర్య కృష్ణకుమారి, ఎంపీటీసీ, లక్కవరం

ప్రణాళికలు తయారు చేస్తున్నాం



గ్రామాలలో నివాస కాలనీలు, వ్యవసాయ పొలాల రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. సర్పంచ్‌ల నుంచి ప్రతిపాదనలు తీసుకుని ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఇటీవల నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ప్రాధాన్యతా క్రమంలో రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు కూడా జరిగాయి.

– మేడిచర్ల వెంకట సత్యవాణి, ఎంపీపీ, మలికిపురం

క్లుప్తంగా

సమాచారం పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది



లక్కవరంలో ఆర్టీఐ చట్టంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మలికిపురం: అధికారుల నుంచి సమాచారం పొందే హక్కు ప్రతి పౌరుడికీ ఆర్టీఐ చట్టం కల్పిస్తోందని ఏవో ఎస్.రాకేష్ అన్నారు. మంగళవారం లక్కవరంలో ఆర్టీఐ చట్టంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆర్టీఐ చట్టంపై వారికి అధికారులు అవగాహన కల్పించారు. వెటర్నరీ డాక్టర్ పీఎస్ రాజు, ఏఈవో శివరామకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి వీరభద్రస్వామి ఉత్సవాలు

సఖినేటిపల్లి: మోరిలో కొలువైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామివారి మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు మంగళవారం దేవస్థానం పూర్తి చేసింది. 13న కలశస్థాపన, పొలిమార్లు కట్టుట, రాత్రి స్వామివారి శాంతి కల్యాణం, 14న వీరభద్రస్వామి సంబరం, అనంతరం స్వామివారి ప్రభ ఊరేగింపు, 15న కార్తిక పౌర్ణమి సందర్భంగా జ్వాలా తోరణం ఏర్పాటు చేశారు. 22న భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నారు. ఉత్సవ నిర్వహణ ప్రతినిధి కామిశెట్టి సూరన్న, ఉత్సవ కమిటి సభ్యులు, వీరభద్రస్వామి యూత్ భక్తుల సౌకర్యాలపై తగిన ఏర్పాట్లు చేశారు.

ఖాతాదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

మలికిపురం: లక్కవరం ఎస్‌బీఐ పరిధిలోని ఖాతాదారులందరికీ మెరుగైన సౌకర్యాలు అందించాలని అమలాపురం ఏజీఎం ఎంవీవీఎం కృష్ణ సిబ్బందికి సూచించారు. మంగళవారం లక్కవరం బ్రాంచిని ఆయన సందర్శించారు. ఏజీఎం కృష్ణను స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు ఘనంగా సత్కరించారు. ఏజీఎం మాట్లాడుతూ, బ్రాంచిలో పని భారం ఎక్కువగా ఉండడం వల్ల ఫీల్డ్ ఆఫీసర్ పోస్టు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. పాల ఏటీఎం తరచూ ఇబ్బంది పెడుతుండడం వల్ల దాని స్థానే కొత్త ఏటీఎం ఏర్పాటు చేసామని అన్నారు. బ్రాంచి మేనేజర్ డి.రామ్ ప్రసాద్, బ్యాంకు స్టాఫ్, ఖాతాదారులు బీఎస్ఎన్ మూర్తి, వలవల రాంబాబు, అంబటి రామ్మోహనరావు పాల్గొన్నారు.

వెంకన్నకు అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో మంగవారం స్వామికి అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు తమ మొక్కులు నెరవేరడంతో అధిక సంఖ్యలో భక్తులు అష్టోత్తర పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఈవో, డీసీ నల్లం సూర్యచక్రధర్‌రావు పర్యవేక్షించారు.

రైల్వే లైన్ నిర్మాణానికి శరవేగంగా సర్వే

మూడు టీమ్‌ల ద్వారా సర్వే నిర్వహణ



మామిడికుదురులో రైల్వే లైన్ నిర్మాణం కోసం నిర్వహిస్తున్న సర్వే

మామిడికుదురు: పాశర్లపూడి నుంచి మొగలికుదురు వరకు ఏర్పాటు చేయనున్న రైల్వే లైన్ నిర్మాణం కోసం చేపట్టిన సర్వే శరవేగంగా జరుగుతోంది. 12 మంది సభ్యులు మూడు బృందాలుగా ఏర్పడి సర్వే చేస్తున్నారు. మండల సర్వేయర్ వాణి నేతృత్వంలో బృందం సర్వే నిర్వహిస్తోంది. పాశర్లపూడి, మామిడికుదురు, పెదపట్నం, గెద్దాడ, మొగలికుదురు గ్రామాల్లో 70 మీటర్ల వంతున, నగరం గ్రామంలో 100 మీటర్ల వంతున రైల్వే లైన్ ఏర్పాటుకు భూ సేకరణ నిర్వహించాలని రైల్వే శాఖ ప్రతిపాదించింది. పాశర్లపూడిలో 55.10 ఎకరాలు, మామిడికుదురులో 15.76 ఎకరాలు, పెదపట్నంలో 9.20 ఎకరాలు, నగరంలో 71.65 ఎకరాలు, గెద్దాడ గ్రామంలో 7.26 ఎకరాలు, మొగలికుదురులో 23.45 ఎకరాల భూమి సేకరించనున్నారు. ఈ ప్రతిపాదిత రైల్వే లైన్ కోసం సర్వే నిర్వహిస్తున్నారు. నగరం గ్రామంలో రైల్వే స్టేషన్ ప్రతిపాదించారని, దాని కోసం అక్కడ 100 మీటర్ల వెడల్పుతో స్థలం సేకరించాల్సి ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ ప్రతిపాదిత రైల్వే లైన్ ఏర్పాటు కోసం చేపట్టిన సర్వే యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. మామిడికుదురులో దీనికి సంబంధించి మంగళవారం సర్వే జరిపారు. ఈ సర్వేలో మండలంలోని వివిధ సచివాలయాలకు చెందిన సర్వేయర్లు, వ్యవసాయశాఖ, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాల్‌ఖంబ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



గుడిమెళ్లంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో సలీం బాషా

మలికిపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో చింతలపూడి బాపిరాజు మెమోరియల్ హైస్కూల్, భీమవరంలో నిర్వహించిన అంతర్ జిల్లాల పోటీల్లో గుడిమెళ్లంక విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాల హెచ్‌ఎం పీఎస్‌వీ సుబ్బారావు, వ్యాయామోపాధ్యాయుడు బి.రాధాకృష్ణ మంగళవారం తెలిపారు. అండర్–14 విభాగంలో కర్రి దేవి, కె.నీలిమ దీప్తి, డి.మురారి దివ్య, కె.తనూజ్, ఆర్.సూర్య, అండర్–17 విభాగంలో కె.టైటస్, ఎ.రాము, పోల్ మాల్‌ఖాంబ్, రోప్ మాల్‌ఖాంబ్‌లలో విశేష ప్రతిభ కనబరిచారన్నారు. డిసెంబర్ 8 నుంచి 15 వరకూ మధ్యప్రదేశ్ ఉజ్జయినిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని అన్నారు. ఎంపికైన విద్యార్థులను కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌కే సలీం బాషా అభినందించారు.

జూడో పోటీల్లో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



జూడో విజేతలను అభినందిస్తున్న అధ్యాపకులు

రాజోలు: ఆదికవి నన్నయ యూనివర్శిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల జూడో పోటీల్లో రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ మేరకు మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు జూడో పోటీల్లో విజేతలను అభినందించారు. ఈ నెల 10, 11 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు ప్రభుత్వ కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో రాజోలు కళాశాలకు చెందిన పి.బాలసత్య బంగారు పతకం సాధించగా వి.రోహిణి, యు.శృతి వెండి పతకాలను సాధించారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, స్పోర్ట్స్ ఇన్‌చార్జి నల్లి రాజు, పీడీ మధుకుమార్, శైలజ, అశ్వని పాల్గొన్నారు.

22న కౌలు రైతుల సదస్సు విజయవంతం చేయాలి

సఖినేటిపల్లి: ఈ నెల 22న సఖినేటిపల్లిలో నిర్వహించనున్న దేవదాయ, ధర్మదాయ కౌలు రైతుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం శృంగవరప్పాడులో కౌలు రైతుల సంఘ సమావేశం జరిగింది. సమావేశంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, వివిధ దేవస్థానాల భూముల్లో కౌలు రైతుల శిస్తుల నిమిత్తం, కౌలు రైతులు కట్టుకున్న ఇళ్లకు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో వారి సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు జిల్లా సదస్సును ఏర్పాటు చేసినట్టు ఆయన అన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర రైతు సంఘ నాయకుడు కేవీవీ ప్రసాద్ తదితర ప్రముఖులు హాజరు కానున్నట్టు ఆయన వెల్లడించారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చెల్లుబోయిన కేశవశెట్టి, మహిమ కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ ఓగూరి టాండన్‌రాజు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లి బుజ్జిబాబు, పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అయినవిల్లి: మండలం నల్లచెరువు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గుండుమొగుల వెంకటేశ్వరరావు సహకారంతో కిమ్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కిమ్స్ వైద్యులు జనరల్, డెంటల్ (దంత), ఆక్యల్ (కంటి) సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



పినపళ్లలో దీక్ష విరమణ

ఆలమూరు: మండలంలోని పినపళ్లలో పారిశ్రామిక వాడల్లో ఉపాధి పనులు కల్పించాలంటూ సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ మహిళలు చేపట్టిన దీక్షను తాత్కాలికంగా విరమించారు. రాత్రి పొద్దు పోయాక ఏఎస్సై కేవీ రమణా రెడ్డి, కానిస్టేబుల్ గంగాధర్‌ను పంపించి స్థానిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక నాయకులు జల్లి వెంకట్రావు, పాలింగి ఉమాదేవి నేతృత్వంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పోలీసులకు అందజేశారు. పేపరుమిల్లు యాజమాన్యం, ప్రజా ప్రతినిధులు, అఖిలపక్ష రాజకీయ పార్టీ నేతలు, బాధితులతో కలసి రూరల్ సీఐ విద్యాసాగర్ సమక్షంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని పోలీసులు హామీ ఇచ్చారు. దీంతో ఆగ్రామ మహిళలు తాత్కాలికంగా నిరసన విరమించారు.

ఎక్సైజ్ దాడుల్లో 13 మంది అరెస్ట్

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు మండలాల్లో అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించిన దాడుల్లో 12 కేసులు నమోదు చేసి 13 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ ఐడీ నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో మాట్లాడుతూ అనధికారం మద్యం బాటిళ్లను నిర్ణీత ధరల కన్నా అధిక ధరలకు విక్రయించినా లేదా బెల్ట్ షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. బెల్ట్ షాపులు, సారా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే 97012 87828 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. అలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని నాగేశ్వరరావు తెలిపారు.

మద్యం షాపుల రిజర్వేషన్ కాపాడుకుందాం

మలికిపురం: ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు, అధ్యక్షులకు కేటాయించిన మద్యం షాపుల రిజర్వేషన్‌ను కలసికట్టుగా కాపాడుకుందామని రాజోలు నియోజకవర్గంలోని నాలుగు మండలాల సదరు కార్మికుల, అధ్యక్షుల సమావేశం తీర్మానించింది. మంగళవారం గూడపల్లి నూకాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈ మేరకు సఖినేటిల్లి, మలికిపురం, రాజోలు, నగరం మండలాలకు చెందిన వారితో జరిగిన పై సమావేశంలో పై విధంగా నిర్ణయించారు. రిజర్వేషన్ మద్యం షాపులను ఇతరులు ఎవరైనా కైవసం చేసుకునేందుకు యత్నిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. తమ సంఘానికి సంబంధించని వారెవరూ కూడా ఇందుకు ప్రయత్నించవద్దని కూడా నియోజకవర్గ పరిధిలోని 36 సంఘాలు తరఫున సమావేశం సూచించింది. కామన చంద్రరావు, కడలి నాగేశ్వరరావు, కాగితపు వెంకటేశ్వరరావు, చెల్లుబోయిన వెంకటశెట్టి, దొంగ వెంకటేశ్వరరావు, గుబ్బల కోటేశ్వరరావు, పాటి త్రిమూర్తులు, కేవీ రెడ్డి, రాయుడు ఆది రామకృష్ణ, కొండేటి రాము పాల్గొన్నారు.

వ్యక్తిగత ఫొటోలు ఎవరికీ షేర్ చేయవద్దు

మామిడికుదురు: సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత ఫొటోలు ఎవరికీ షేర్ చేయవద్దని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ సూచించారు. మామిడికుదురు దీప్తి కళాశాలలో మహిళా సంరక్షణ కార్యక్రమంలో భాగంగా కళాశాల కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. అపరిచిత వ్యక్తులతో ఫోన్ మాట్లాడ్డవద్దని, ఎవరు ఇబ్బంది పెట్టిన తక్షణం తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తో పాటు మహిళల రక్షణకు సంబంధించిన పలు అంశాలను ఆయన వివరించారు. చదువుపై మనసు లగ్నం చేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

ఆత్రేయపురం: పదకొండో వేతన సవరణ గడువు ముగిసినా 12వ వేతన సవరణ ఊసే లేదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగుల గోడు వినడం లేదని అన్నారు. మండలంలోని ర్యాలి జెడ్పీ పాఠశాల వద్ద ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఏం మాట్లాడకపోవడంపై ప్రభుత్వాన్ని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సర్వే సచ్చిపోదాం రాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నాగిరెడ్డి శివప్రసాద్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు తోట బాలకృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్ సుదర్శన చక్రవర్తి, ఆత్రేయపురం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.దొరబాబు, జి. మాణిక్యాలరావు, శ్యాంబాబు, ఎం వెంకన్న పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆత్రేయపురం: ఆత్రేయపురం గ్రామాన్ని అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ దత్తత తీసుకుందని ఆ సంస్థ చైర్మన్ భూపతిరాజు పెండేటి తెలిపారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడం, వైద్య సేవలు అందించడం వంటి కార్యక్రమాలను ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గ్రామంలో మంగళవారం పర్యటించారు. సమావేశంలో తన సేవా కార్యక్రమాల గురించి వివరించారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ. 2.10 లక్షలు



ఆలమూరులో డిగ్రీ కళాశాలకు విరాళం అందజేస్తున్న ఎడ్యుకేషనల్ ట్రస్టు ప్రతినిధులు

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఆలమూరు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ రూ.2.10 లక్షల విరాళాన్ని అందజేసింది. డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదివే విద్యార్థుల ఫీజుల నిమిత్తం రూ.1.63 లక్షలు, కళాశాలలో మంచినీటి సౌకర్యం, ఇన్వర్టర్ ఏర్పాటు తదితర అవసరాల కోసం రూ. 50 వేలను ఖర్చు చేయాలని కళాశాల యాజమాన్యం నిర్ణయించింది. ఈ మొత్తాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నరసింహస్వామికి మంగళవారం ట్రస్ట్ చైర్మన్ గుణ్ణం వీర్రాజు, సంయుక్త కార్యదర్శి గారపాటి త్రిమూర్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసించే మొదటి సంవత్సరం విద్యార్థుల ఫీజులను చారిటబుల్ ట్రస్ట్ భరిస్తుందన్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం.బాలస్వామి, సీనియర్ అసిస్టెంట్ తోట మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

పి.గన్నవరం: మంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో 58 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. వారిలో 12 మందిని ఉచిత కంటి ఆపరేషన్ల కోసం గుర్తించారు. కార్యక్రమానికి హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యం వహించారు. పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సిబ్బంది సేవలందించారు.

వైభవంగా ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ పూజలు

మామిడికుదురు: ఆదుర్రులోని సర్వమంగళ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. వేద మంత్రోచ్చారణల నడుమ ఈ కార్యక్రమం ఆద్యంతం కన్నులపండువలా జరిపించారు. దీనిలో భాగంగా పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో పండితులు గణపతి పూజ, పుణ్యాహవాచనం తదితర పూజలను వైభవంగా జరిపించారు. రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ధ్వజస్తంభానికి అవసరమైన కర్ర కొనుగోలుకు రూ.2.60 లక్షలు విరాళంగా అందించారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మశ్రీ ఉపాధ్యాయుల సూర్యనారాయణమూర్తి, సుబ్బలక్ష్మి దంపతులచే ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరుగుతోంది. బుధవారం ఉదయం 6.54 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

వీరేశ్వరునికి లక్ష బిల్వార్చన

అంబాజీపేట: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసిన ఉమాపార్వతీ సమేత వీరేశ్వరస్వామికి, శ్రీ, భూ సమేత కేశవస్వామి వార్లకు లక్ష బిల్వార్చనను మంగళవారం నిర్వహించారు. గోవిందవర్జుల నాగబాబు బ్రహ్మత్వంలో వీరేశ్వరస్వామికి, కేశవస్వామి వార్లకు అభిషేకాలు, లక్ష బిల్వార్చన, లక్ష తులసి పూజలను కాపు మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం రాత్రి అన్నసమారాధన చేపట్టారు. అలాగే మండలంలోని మాచవరంలో పార్వతీ రాజేశ్వరస్వామి, కందుల మల్లేశ్వరస్వామి వార్ల ఆలయంలో పూజలు చేశారు. మండలంల్లోని పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, కె.పెదపూడి, నందంపూడి, తొండవరం, గంగలకుర్రు, ముక్కామల తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజాము నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు.

బాలబాలాజీకి లక్ష తులసి పూజ

మామిడికుదురు: కార్తిక శుద్ధ ఏకాదశి సందర్భంగా అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి మంగళవారం లక్ష తులసి పూజ ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయ అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రుత్విక్ వరుణ, తదితర పూజలతో పాటు అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చన పూజ ఘనంగా జరిగింది. అనంతరం స్వామి వారికి రాజభోగ నివేదన, సాయం కాలార్చన, తీర్థ ప్రసాద గోష్టి తదితర పూజలను వైభవంగా జరిపించారు. లక్షతులసి పూజలో పలువురు భక్తులు కర్తలుగా పాల్గొని బాలబాలాజీ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజ ఆద్యంతం ఘనంగా జరిగింది.

డీఎస్సీ వాయిదా వేయడం తగదు

అంబాజీపేట: ఎస్సీ వర్గీకరణ నెపంతో డీఎస్సీ నోటిఫికేషన్ వాయిదా వేయడం తగదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు నాగాబత్తుల నరసింహమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది నవంబర్ 6న నోటిఫికేషన్ ఇచ్చి వచ్చే మార్చిలోగా నియామకాలు చేస్తామని ప్రభుత్వం గతంలో మాట ఇచ్చిందన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం వేలాది మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్న తరుణంలో వాయిదా వేయడం సమంజసం కాదన్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే డీఎస్సీ ప్రకటించి ఆ ప్రక్రియను వేగవంతం చేసి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలుపుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశను సాకుగా చూపించి డీఎస్సీ వాయిదా వేయకుండా వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు.

దళిత జాతి విచ్ఛిన్నానికే వర్గీకరణ

అయినవిల్లి: దళిత జాతిని విచ్ఛిన్నం చేసేందుకే ఎస్సీ వర్గీకరణ అంశానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయని రాక్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. మండలంలోని వీరవల్లిపాలెం బొమ్మరాళ్లతిప్పలో మంగళవారం రాక్స్ జాతీయ ఉపాధ్యక్షుడు కొంకి వెంకట్రావు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటంపై జన సమీకరణలో భాగంగా ఆర్ఎస్ రత్నాకర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ముసుగులో దళిత జాతిని విచ్ఛిన్నం చేయడానికి రాజకీయ పార్టీలు కంకణం కట్టుకున్నాయన్నారు. దీనికి మంద కృష్ణమాదిగని పావుగా వాడుకుంటున్నారన్నారు. త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి తగిన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించినారు. కార్యక్రమంలో సర్పంచ్ కాశి వీవీ సత్యనారాయణమూర్తి ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అయినవిల్లి: గ్రామంలో కొలువైన సీతారామచంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం వేదపండితుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామికి విశేష అభిషేకాలు పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పీఎన్నార్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

రాజోలు: పీఎన్నార్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని రాజోలు ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.సాయిబాబు, జె.శాంతకుమారి అన్నారు. మంగళవారం పీఎన్నార్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ పితాని నాగరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కంప్యూటర్‌ను బహూకరించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి పీఎన్నార్ ట్రస్ట్ ఎనలేని సేవలు అందిస్తుందన్నారు. ఎందరో నిరుపేద విద్యార్థులకు చైర్మన్ నాగరాజు అండగా నిలుస్తున్నారన్నారు. పేదరికం చదువుకు ఆటంకం కలగకూడదనే లక్ష్యంతో కృషి చేస్తున్న ట్రస్ట్ సేవలను కొనియాడారు. పీఆర్వో ఎస్.రాజు, అధ్యాపకులు కె.గణేశ్వరరావు, ఎం.అంబేద్కర్, కె.శ్రీరాములు, బీఎస్ నరసింహారావు, ఎన్ఎస్ఎస్ పీఓ జె.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.